నాలాపై ఆక్రమణలు తొలగించండి

- అధికారులకు ఎమ్మెల్యే తలసాని ఆదేశం
- నాలా రీమోడలింగ్ పనులు పరిశీలించిన శ్రీనివాస్‌యాదవ్



నాలా రీమోడలింగ్ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట్, ఫిబ్రవరి 6: అమీర్‌పేట్ గాయత్రీనగర్ నాలా రీమోడలింగ్ పనులకు అడ్డంకిగా మారిన నాలాపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. కొద్ది పాటి వర్షానికే అమీర్‌పేట్ గాయత్రీనగర్‌లో వరద ముంచెత్తుతున్న పరిస్థితుల్లో ఇక్కడి నాలా రీమోడలింగ్ పనులను రూ. 1.5కోట్లతో చేపడుతున్నారు. ఈ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే తలసాని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాలా రీమోడలింగ్ పనులు సగభాగం పూర్తయ్యాయని, ఇక్కడ నెలకొన్న ఆక్రమణల కారణంగా పనులు ముందుకు సాగడం ఇబ్బందిగా మారిందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గాయత్రీనగర్‌లో వరద ముంపు సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యల్లో భాగంగా నాలా రీమోడలింగ్ పనులు జరుగుతున్నాయని, ఈ విషయంలో నాలా ఆక్రమణలకు ఎవరూ పాల్పడినా ఉపేక్షించ వద్దని, వెంటనే తొలగించే పనులు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, జీహెచ్‌ఎంసీ ఈఈ ఇందిర, ఖైరతాబాద్ డిప్యూటీ కమిషనర్ జగన్, డీఈఈ యతీంద్ర మోహన్, జలమండలి జీఎం.హరిశంకర్, డీజీఎం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే..

ఎస్ఆర్‌నగర్ వయోధికుల మండలి ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. వయోధికులను ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉండేందుకు వీలుగా మండలి కార్యాలయ ఆవరణలో ఓపెన్ ఎయిర్ జిమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకొన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి, వయోధికుల మండలి అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, ముఖ్య సలహాదారు కాసాని సహదేవ్‌గౌడ్ పాల్గొన్నారు.

10న నియోజకవర్గ కార్యకర్తల సమావేశం

బేగంపేట్ ఫిబ్రవరి 6: ఈనెల 10వ తేదీన సనత్‌నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మంగళవారం డివిజన్ లోని పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు తప్పకహాజరు కావాలని సూచించారు. ఎమ్మెల్యే తలసాని ఆదేశాల మేరకు కార్యకర్తలంతా ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్, ఆంజనేయులు, సతీశ్, గణేశ్, కోటేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పాల్గొన్న కార్యకర్తలు

ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ అధినేత ఆశీర్వాదం

కంటోన్మెంట్, ఫిబ్రవరి 6: బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు మూడు నెలల తర్వాత తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం తొలిసారి కేసీఆర్ పార్టీ కేంద్ర కార్యాలయానికి మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున పార్టీ శ్రేణులు కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బొట్టు పెట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

'గాంధీ' సూపరింటెండెంట్‌కు సత్కారం

బన్సీలాల్‌పేట్ ఫిబ్రవరి 6: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎంపికైన గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావును మంగళవారం తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు భూపేందర్ రాథోడ్, మురళీధర్, రవి, అబ్బయ్య, దేవోజీ, ఆర్ఎంఓ,1 డాక్టర్ జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ పూలే ఫ్రంట్ యూత్ వింగ్ కన్వీనర్‌గా ఆలకుంట హరి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: బీసీల హక్కుల సాధన కోసం ఏర్పడిన యునైటెడ్ పూలే ఫ్రంట్ యూత్ వింగ్ కన్వీనర్‌గా తార్నాక డివిజన్‌కు చెందిన ఆలకుంట హరి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం బీఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ పోరాటం ఆపబోమని అన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన కోసం భారత జాగృతితో కలిసి ఈనెల 12న ఇందిరాపార్క్ వద్ద

మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ తన ఎన్నికల హామీలో భాగంగా పేర్కొన్న బీసీ కులజనగణనను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయిస్తూ బడ్జెట్‌లో నిధులు ఇవ్వాలని కోరారు. బీసీల సంక్షేమం, మహిళా విద్యాభివృద్ధికి విశేష కృషి చేసి సంఘ సంస్కర్తలు మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలేల చరిత్రలను పాఠ్యాంశాల్లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ముత్యాలమ్మ ఆలయానికి రూ. 25వేలు విరాళం

కంటోన్మెంట్, ఫిబ్రవరి 6: బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లో ముత్యాలమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 14వ తేదీన ఉండటంతో మంగళవారం ఆలయంలోని పనులను ఆలయ ఫౌండర్ చైర్మన్ జంపన ప్రతాప్, అధ్యక్షులు దుర్గయ్యలతో కలిసి మహంకాళి ఆలయ ప్రధాన అర్చకులు వేణుమాధవ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ ఆలయంలో పనులను వేగవంతం చేయాలని ఈనెల 12,13,14వ తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు విచ్చేసి అమ్మవారి ఆశీర్వాదం పొందాలని కోరారు. ఆలయానికి ఎవరైనా సహాయం చేయాలనుకునే దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయానికి పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు రూ. 25వేల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, కుమార్, లక్ష్మణ్, కనకరాజు, రాములు, కనకేశ్, సంపత్, కొమురయ్య, రామారావు, కుమార్, నర్సింహ, అజిత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయానికి రూ.25వేల చెక్కును అందజేస్తున్న పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు

యోగా పోటీల్లో విద్యార్థులకు పతకాలు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 6: తెలంగాణలోని బెల్లంపల్లిలో జరిగిన అంతర్జాతీయ యోగా పోటీల్లో హైదరాబాద్ అల్వాల్ సెయింట్ మైఖేల్ స్కూల్‌కు చెందిన 11 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను సాధించారని యోగా ట్రైనర్ హరికృష్ణ తెలిపారు. మంగళవారం తుకారాంగేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో వివిధ ఏజ్ గ్రూపుల వారీగా జరిగిన యోగా పోటీల్లో విద్యార్థులు గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ లను సాధించారని ఆయన తెలిపారు. అయితే జైపూర్‌లో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో 5వ తరగతి చదువుతున్న రాహుల్ మోతే బంగారు పతకాన్ని సాధించారని పేర్కొన్నారు.

బంగారు పతకాన్ని అందుకుంటున్న రాహుల్ మోతే

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నార్త్‌జోన్ టిప్పర్ లారీ అండ్ ట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

'సమస్యలు పరిష్కరించండి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: తమ సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్ నార్త్‌జోన్ టిప్పర్ లారీ అండ్ ట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డిను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డుల్లో తమకు డంపు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్మికులకు అనుకోకుండా ఏమైనా జరిగితే ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ఈఎస్ఐసీ పక్షోత్సవాలు ప్రారంభం

జ్యోతి వెలిగించి పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న ఈఎస్ఐసీ సెక్యురిటీ సిబ్బంది, చిత్రంలో ఈఎస్ఐసీ డైరెక్టర్ డాక్టర్ మాధురి శ్రీష్ కాటే, సూపరింటెండెంట్ డాక్టర్ రాధిక

అమీర్‌పేట్, ఫిబ్రవరి 6: ఈఎస్ఐసీ 73వ పక్షోత్సవాలు సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ దవాఖానలో మంగళవారం ప్రారంభమయ్యాయి. 5 నుంచి 19వ తేదీ వరకు ఈ పక్షోత్సవాల్లో ఈఎస్ఐసీ ద్వారా బీమాదారులకు అందుతున్న వైద్యంతో పాటు అందుబాటులో ఉన్న ఇతరత్రా సేవల పట్ల వారికి అవగాహన కల్పించే దిశగా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మంగళవారం సనత్‌నగర్‌లోని వైద్య కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఈ పక్షోత్సవాలను ఈఎస్ఐసీ డైరెక్టర్ ప్రొ. డాక్టర్ మాధురీ శ్రీష్ కాటే, ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధిక సమక్షంలో ఇక్కడి సెక్యురిటీ సిబ్బంది జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రెండు వారాల పాటు కొనసాగే ఈ పక్షోత్సవాల్లో బీమాదారుల కోసం అదనంగా వైద్య శిబిరాలు, స్క్రీనింగ్ క్యాంపులు, ఆరోగ్యాంశాలపై అవగాహన సదస్సులు కొనసాగుతాయని ఈఎస్ఐసీ డైరెక్టర్ ప్రొ. డాక్టర్ మాధురీ శ్రీష్ కాటే తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఈఎస్ఐసీ ద్వారా బీమాదారులకు అందుతున్న వైద్య సదుపాయాలను వివరించడమే కాకుండా భవిష్యత్తులో తమ ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించడం జరుగుతుందని వివరించారు. రెండు వారాల పాటు జరిగే ఈ పక్షోత్సవాలను బీమాదారులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సుమన్‌కుమార్ (ఫైల్)

వ్యక్తి అదృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన వారసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామ్‌నగర్‌లోని బాప్టిస్ట్ చర్చ్ సమీపంలో సుమన్‌కుమార్ తన కుటుంబంతో సహా నివసిస్తున్నారు. ఆయనకు భార్య కంచన్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం రాత్రి తన ఇంట్లో బెడ్‌రూంలో భార్యాపిల్లలు నిద్రించారు. సుమన్ కుమార్ హాల్‌లో టీవీ చూస్తూ నిద్రించాడు. సోమవారం ఉదయం నిద్ర లేవగా భర్త కనిపించలేదు. రోజూలానే వాకింగ్ వెళ్లి వస్తాడనుకున్నప్పటికీ అతను తిరిగిరాలేదు. దీంతో భర్త ఫోన్‌కు ప్రయత్నించగా, ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కంగారు పడింది. ఇండ్ల పంపిణీ విషయంలో తన సోదరులు తనకు అన్యాయం చేస్తున్నాడని, ఆ అసంతృప్తితో తాను ఏదైనా చేయాలనే ఆలోచనతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు ఆయన లేఖ రాసి ఇంట్లో పెట్టి వెళ్లినట్లు ఆయన భార్య పేర్కొన్నారు. అతని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో నిరుద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. 'ప్రభుత్వ ఉద్యోగాలు – సమస్యలు, పరిష్కారాలు'అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని రూం నంబర్ 57లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 46 సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. దానికి అతిత్వరలోనే పరిష్కారం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోటీ పరీక్షల నిపుణుడు అశోక్, ప్రముఖ న్యాయవాది శరత్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు సన్మానం

ఇటీవల ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను పలువురు తార్నాక డివిజన్‌కు చెందిన నేతలు మంగళవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ బిల్డర్స్ అధినేత శ్రీనివాస్, రాజేశ్, న్యాయవాది అరవింద్, డాక్టర్ సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

'మాదిగ జాతి కోసం ఉద్యమించండి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాదిగ జాతి శ్రేయస్సు కోసం ఇక నుంచి ఉద్యమించాలని రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్యను దళిత మేధావుల సంఘం, మాదిగ ఇంటలెక్చువల్ ఫోరం, మాదిగ విద్యార్థి సంఘం నాయకులు కోరారు. మంగళవారం ఆయనను కలిసిన ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ మనకు రావాల్సిన న్యాయపరమైన డిమాండ్ల పట్ల ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద కమ్యూనిటీగా ఉన్న మాదిగలు తమ వాటాను వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాని కోసం పోరాడాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్, మేడి రమణ, కొత్తపల్లి తిరుపతి, జాన్ దర్శనం, ప్రవీణ్, ములుగు రాజు, అనిల్‌కుమార్, ప్రదీప్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం

కంటోన్మెంట్, ఫిబ్రవరి 6:వార్డులో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రెండో వార్డులోని అన్నానగర్‌లో ఎమ్మెల్యే నిధులతో మంజూరైన నూతన బోర్‌వెల్ పనులను స్థానిక నేతలతో కలిసి టీఎన్ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో హరికృష్ణ, జయరాజ్, శ్రీనివాస్, కుమార్ ముదిరాజ్, నర్సింహ, ప్రకాశ్, నాగరాజ్, శ్యామ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కంటోన్మెంట్, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు, పల్లవి ఫౌండేషన్ చైర్మన్ మల్క కొమరయ్య సూచించారు.మంగళవారం కంటోన్మెంట్ లోని మడ్‌ఫోర్డ్ బస్తీలో నిర్వహించిన బూత్ ఛలో–బస్తీ ఛలో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గాంధీనగర్ డబుల్ బెడ్ ఇండ్ల బస్తీలో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా కొమరయ్య మాట్లాడుతూ సొంత ఇల్లు లేని నిరుపేదలందరూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విక్రమ్, బీజెవైఎం నాయకులు నరేశ్, కిషన్ రాజ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు బస్తీవాసులు షణ్ముఖం, దశరథ్, కిశోర్, సంజయ్, వరుణ్, శేఖర్, అశోక్, సుబ్బమ్మ, ఉమా,సువర్ణ,గాయత్రి ఉన్నారు.

గంజాయి ఆయిల్ ను తరలిస్తున్న నిందితులు రిమాండ్

బొల్లారం,ఫిబ్రవరి 6: సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన యువకులు గంజాయి ఆయిల్‌ను తరలిస్తూ పట్టుబడ్డారు.సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం..ఈనెల 5న బొల్లారం పోలీసులు బొల్లారం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా హంటల్ బాల్‌రాజు,కొర్ర సుఖదేవ్,గెమ్మెలి రాంబాబులు బైక్‌పై శామీర్‌పేట ఓఆర్ఆర్ నుంచి అల్వాల్ వైపు వెళ్తున్నారు.ఈ క్రమంలో పోలీసులను గమనించిన నిందితులు యూటర్న్ తీసుకొని వేగంగా వెళ్తుండగా ఎస్సై రామకృష్ణ వారిని అదుపులోకి తీసుకొని వాహనాన్ని తనిఖీ చేయగా నార్కోటిక్ డ్రగ్స్ హష్ ఆయిల్ 3కిలోలతో పాటు బైక్, 3 సెల్‌ఫోన్లు రూ.(15,55, 000)వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

కంపోస్టింగ్‌పై అవగాహన

బొల్లారం,ఫిబ్రవరి 6: కంటోన్మెంట్ 8వ వార్డు బొల్లారం వివేకానంద కాలనీలో మంగళవారం బోర్డు సిబ్బంది (హోమ్ కంపోస్టింగ్) పై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కూరగాయల నుంచి లభించే వ్యర్థ పదార్థాలను పడేయకుండా కంపోస్టింగ్ చేసి పూల మొక్కలకు వేయడంతో మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. బోర్డు సిబ్బంది, రామారావు, బాబు సుందర్, బాల్‌రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

బేగంపేట్ ఫిబ్రవరి 6: పార్కు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి అధికారులను ఆదేశించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట్ డివిజన్‌లోని మయూరిమార్గ్ ద్వారకదాస్ కాలనీలో రూ.35లక్షలతో చేపట్టిన పార్కు అభివృద్ధి పనులను బేగంపేట్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం ఈఈ సుదర్శన్‌తో కలిసి ఆమె మంగళవారం పరిశీలించారు. మరో నెల రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేస్తామని అధికారులు ఆమెకు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: SECUNDRABAD
O.S.NO: 60/2024
Between:
1. Mrs. Janapareddi Vijayalakshmi W/o Janapareddi Prasanna Anjaneyulu
2. Mr. Phanesh Janapareddi S/o Janapareddi Prasanna Anjaneyulu
3. Mr. Sukhesh Venkata Janapareddi S/o Janapareddi Prasanna Anjaneyulu
... Plaintiffs
AND
1. The Tahsildar, Secunderabad Mandal, Hyderabad District.
2. All Concerned
... Defendants
Please take notice that the above named Plaintiffs have filed the above said OS to declare them as legal heirs of the Deceased Janapareddi Prasanna Anjaneyulu S/o. Janapareddi Suryanarayana Rao died on 25-04-2020 and if anybody has got any objection for the same, they may file their objections on 05.03.2024 before the above mentioned Hon'ble Court at 10.30 AM and if no objection is received on that day, then the Hon'ble Court will decide / adjudicate the matter on merits.
// By Order of the Hon'ble Court //
M/s. V.S.R.M.V.PRASAD SANAKA PESARA Narsi Reddy Muddam Vishal Reddy Advocates
FLAT NO.206, Anuradha Apartments, H.NO.8-3-982/5, Srinagar Colony, Yellareddyguda,Hyderabad.
(COUNSEL FOR THE PLAINTIFFS)